క్లుప్తంగా

25 నుంచి గడ్డిబజారులో శివ పూజలు

కడప కల్చరల్: కడప నగరం గడ్డిబజారులోగల శ్రీ కామకోటి కళాంబదేవి, శ్రీ సోమసుందరేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 25 నుంచి శివరాత్రిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు అర్చకులు చంద్రమౌళిశర్మ తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 25న సాయంత్రం 5.00 గంటలకు శివప్రదోశం, గోపూజ నిర్వహించనున్నట్లు తెలిపారు. 26న ఉదయం 9 గంటకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 4 గంటలకు శివపార్వతుల కల్యాణోత్సవం ఉంటుందని, ఈ సందర్భంగా భరతనాట్య ప్రదర్శన కూడా ఉంటుందని తెలిపారు. రాత్రి 7 గంటలకు శివపార్వతుల గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. రాత్రి 12 గంటలకు లింగోద్భవ సమయంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం ఉంటుందని, అనంతరం సహస్ర రుద్రాక్ష అర్చన నిర్వహిస్తామన్నారు. 27న శివరాత్రిని పురస్కరించుకుని స్వామి వారికి ఉదయం 6 గంటలకు పుష్పాభిషేకం నిర్వహిస్తామన్నారు. లింగోద్భవ సమయంలో స్వామిని అర్చించిన రుద్రాక్షలను భక్తులకు ప్రసాదంగా అందజేయనున్నట్లు ఆయన వివరించారు.

రేపు కాలాష్టమి పూజలు

కడప కల్చరల్ : కడప నగరంలోని బాసట స్వచ్ఛంద సేవా సంస్థ దత్తత గ్రామమైన శ్రీ కాలభైరవపురం (ఎమ్మెస్ కొట్టాల)లో గురువారం కాలాష్టమిని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 8 గంటల నుంచి శ్రీ ఇష్ట కామ్యార్థ కాలభైరవ స్వామికి పంచామృత అభిషేకం, అష్టోత్తరం కుష్మాండ దీప సేవారాధన తదితర పూజాదికాలు నిర్వహించనున్నారు. భక్తుల పూజలకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ నిర్వాహణ కమిటీ సిద్ధం చేసింది.

22న ఉయ్యాలవాడ వర్ధంతి సభ

కడప సెవెన్‌రోడ్స్ : రాయలసీమ తొలి స్వాతంత్ర్యయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 178వ వర్ధంతి సభ ఈనెల 22వ తేదీ ఉదయం 10 గంటలకు కడప ప్రెస్‌క్లబ్‌లో నిర్వహిస్తున్నామని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి ఎస్.రవిశంకర్‌రెడ్డి, రెడ్డి సేవా సమితి జిల్లాప్రచార కార్యదర్శి పద్మప్రియ చంద్రారెడ్డి, ఏపీ రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షులు లింగందిన్నె విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. రేనాటి సూర్య చంద్రుల విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో రాజంపేట శాసన సభ్యులు ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, కడప మున్సిపల్ మాజీ చైర్మన్ ఎస్.హరీంద్రనాథ్, రూపనగుడి గ్రామానికి చెందిన ఉయ్యాలవాడ వారసులు కర్ణాటి ప్రభాకర్‌రెడ్డి, నంద్యాలకు చెందిన సీనియర్ పాత్రికేయులు ప్రభాకర్‌రెడ్డి పాల్గొంటారని వివరించారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, మహాదాత బుడ్డా వెంగళరెడ్డి రాయలసీమ వాళ్లు గనుకే చరిత్రకారులు వివక్ష చూపారన్నారు. వీరి త్యాగం, దాతృత్వానికి చరిత్ర పుటల్లో చోటుదక్కలేదన్నారు. వీరి విగ్రహాలు కడప నగరంలో ఏర్పాటయ్యే వరకు విశ్రమించబోమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీపీ నాయకులు ప్రసాద్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం ఉత్సవాల్లో చంద్రశేఖర్ వ్యాఖ్యానం



ఐఎల్ఎన్ చంద్రశేఖర్‌రావు

కడప కల్చరల్ : ప్రముఖ శైవ ఆధ్యాత్మిక కేంద్రం శ్రీశైలంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలలో 11 రోజులపాటు జరగనున్న కార్యక్రమాలను ప్రత్యక్ష వ్యాఖ్యానం చేసేందుకు కడప నగరానికి చెందిన ఐఎల్ఎస్ చంద్రశేఖర్‌రావుకు పిలుపు వచ్చింది. ఈ మేర కు ఆ క్షేత్రం కార్య నిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు ఆయనకు ప్రత్యేకంగా ఆహ్వానం పంపారు. ఈనెల 19 ఉదయం నుంచి మార్చి 1వ తేదీ రాత్రి వరకు జరిగే కార్యక్రమాలను ప్రత్యక్ష వ్యాఖ్యానం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తామని, వసతులు కల్పిస్తామని తెలిపారు. ఐఎల్ఎస్ ఆధ్యాత్మిక గ్రంథాల రచయితగా, వ్యాఖ్యాతగా సుపరిచితులు. ఆయన చరిత్ర అధ్యాపకులుగా విధులు నిర్వర్తిస్తున్నారు.

అన్నదానం



వృద్ధులకు అన్నదానం చేస్తున్న దాతలు

కడప అర్బన్: కడప నగరంలోని పక్కీరుపల్లి నివాసి, పాలవ్యాపారి బుడమగుంట్ల వెంకటసుబ్బయ్య సతీమణి దీప్తి కుమారుడు భువన్ కుమార్ జన్మదిన సందర్భంగా హిమవర్షిణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బృందా వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. ఫౌండేషన్ నిర్వాహకులు ఆర్టీసీ కానిస్టేబుల్ గుండ్లకొండ రవి, పుట్టా పురుషోత్తం, ఆర్టీసీ రిటైర్డ్ కండక్టర్ వెంకటసురేష్‌బాబు, దామోదర్, ఎలక్ట్రీషన్ మధు, వృద్ధాశ్రమ నిర్వాహకులు బాలసుబ్బయ్య పాల్గొన్నారు.

మైదానంలో ఆరోగ్య బాట









జీవనశైలి మారింది. ఉరుకులు పరుగుల జీవితం అలవాటు అయింది. అయితే ఆరోగ్యం మీద కాస్త శ్రద్ధ పెట్టండి.. రోజూ కొంత సమయం వ్యాయామానికి కేటాయించండి అంటూ వైద్యులు సూచిస్తున్నారు. చాలా మంది ఉదయం.. సాయంత్రం వేళల్లో ఆరోగ్యాన్ని కాపాడుకునే క్రమంలో వాకింగ్ బాట పడుతున్నారు. కడప నగరంలోని మునిసిపల్ మైదానంలో చిన్నారుల నుంచి పెద్దల వరకు వ్యాయామం చేసేందుకు రోజూ వస్తున్నారు. పెద్దలు వాకింగ్ చేస్తుంటే.. చిన్నారులు వాకింగ్, రన్నింగ్, బ్యాట్మింటన్, టెన్నిస్, క్రికెట్ ఇలా తమకు ఇష్టమైన క్రీడలను సాధన చేస్తూ ఉల్లాసంగా గడుపుతున్నారు. ఇక యువత జిమ్, వెయిట్ లిఫ్టింగ్, హాకీ, వాలీబాల్, క్రికెట్, రన్నింగ్ చేస్తున్నారు.

– సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్, కడప







ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఫౌండేషన్ అడ్మిషన్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ తెలిపారు. శిక్షణకు టెన్త్ పాస్, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా పాస్ లేదా ఫెయిల్ అయిన అభ్యర్థులు 18–28 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. బెంగుళూరులో 35 రోజులపాటు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణానంతరం ప్రతిభనుబట్టి ఉపాధి కల్పిస్తామన్నారు. వివరాలకు 90004 87423 నెంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

బేబి బెడ్స్ వితరణ



బేబీ బెడ్ అందజేస్తున్న దృశ్యం

కడప కోటిరెడ్డిసర్కిల్: రిమ్స్ ఆస్పత్రిలో డెలివరీ అయిన చిన్నారులకు బేబి బెడ్స్‌ను అందజేశారు. మంగళవారం ముంబయిలోని ఓ వైద్యురాలి సహాయంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని నగరవాసి ఉదయభాస్కర్ తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను దాతల సహాయంతో నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

రిమ్స్ మార్చురీలో రెండు మృతదేహాలు





కడప అర్బన్: కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో చికిత్స పొందుతూ ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. వారి ఆచూకీ తెలిసిన వారు ఎవరైనా వుంటే తమను సంప్రదించాలని రిమ్స్ అధికారులు తెలియజేశారు.

బురద నీరు ఎలా తాగాలి..?

– ఫిర్యాదు చేసిన మాసాపేట వాసులు

కడప కార్పొరేషన్: కడప నగరంలో తాగునీటికి బదులు ఉప్పునీరు, బురద నీరు సరఫరా అవుతున్నాయని.. ఆ నీటిని ఎలా తాగాలని మాసాపేట ప్రజలు వాపోయారు. మంగళవారం వారు కమిషనర్ మనోజ్‌రెడ్డికి ఫిర్యాదు చేయడానికి నగరపాలక సంస్థ కార్యాలయానికి వచ్చారు. ఆయన అందుబాటులో లేకపోవడంతో వినతిపత్రాన్ని తపాలలో ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలోని 26వ డివిజన్ మాసాపేట కొత్తకొట్టాలలో గతంలో రోజు మార్చి రోజు తాగునీరు సరఫరా అయ్యేవన్నారు. సుమారు ఆరేడు గంటల పాటు నీరు వదలడం వల్ల రెండు గంటల పాటు బురదనీరు, ఉప్పునీరు వచ్చి తర్వాత మంచినీరు వచ్చేవన్నారు.

ఇప్పుడు ప్రతిరోజూ తాగునీరు అందిస్తున్నామనే పేరుతో ప్రతి రోజూ సాయంత్రం 5 గంటల నుంచి 7.15 గంటల వరకూ నీరు వదులుతున్నారని, కానీ ఆ రెండు గంటలపాటు ఉప్పునీళ్లే వస్తున్నాయని, మంచినీరు రావడం లేదన్నారు. ఈ కలుషిత నీరు తాగి కామెర్లు, జ్వరాలు వస్తున్నాయన్నారు. నగరపాలక అధికారులు గతంలో మాదిరిగానే రోజు మార్చి రోజు మంచినీటిని సరఫరా చేయాలని కోరారు.

అప్పుడే బాగుండేది ..



రోజు మార్చి రోజు నీటిని సరఫరా చేసేటప్పుడే మాకు ఎంతో బాగుండేది. సుమారు ఆరు గంటల పాటు నీటిని వదలడం వల్ల మురికినీరు, బురదనీరంతా వెళ్లిపోయిన తర్వాత వచ్చే మంచినీటిని పట్టుకొనే వాళ్లం. ఇప్పుడు రోజూ ఇస్తున్నామనే పేరుతో రెండు గంటలు మాత్రమే నీటిని వదులుతున్నారు. ఈ రెండు గంటలూ మురికినీరు మాత్రమే వస్తున్నాయి. మంచినీరు రావడం లేదు. – జి. దొరసానమ్మ, మాసాపేట

తాగునీటి సమస్యను పరిష్కరించాలి



మాసాపేటలో తాగునీటి సమస్యను పరిష్కరించాలి. పైపులైన్ లీకేజీ వల్లే మాసాపేటలో మురికినీరు సరఫరా అవుతున్నాయి. చాలా మాసాలుగా ఈ సమస్య ఉంది. ఇప్పుడు ప్రతిరోజూ రెండు గంటలు నీటిని వదలడం వల్ల మురికినీటిని ఎవరూ పట్టుకోవడం లేదు. తద్వారా అందరికీ ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

– జి. సంపూర్ణమ్మ, మాసాపేట

సదుపాయాలు కల్పించాలి

కడప రూరల్: కడప నగరంలోని గౌస్‌నగర్‌లో మౌళిక సదుపాయాలు కల్పించాలని జేకే యూత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు పీ ఖాదర్‌బాష తెలిపారు. మంగళవారం స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ మనోజ్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ కాలనీలో అధిక శాతం నిరుపేదలు జీవిస్తున్నారని తెలిపారు. ఈ ప్రాంతంలో సరైన రోడ్లు, మురుగు కాలువలు ఇతర మౌళిక సదుపాయాలు లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో షఫీవుల్లా పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి



మీడియాతో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి

కడప సెవెన్‌రోడ్స్ : ఎన్నికల హామీలన్నీ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు విజయజ్యోతి, నగర అధ్యక్షులు అఫ్జల్‌ఖాన్ డిమాండ్ చేశారు. పీసీసీ ఆదేశాల మేరకు మంగళవారం కలెక్టరేట్ ఎదుట థాళీ బజావో పేరిట ప్లేట్లు, స్పూన్లతో శబ్దం చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు దాటినా పెన్షన్లు, ఉచిత గ్యాస్ తప్ప ఏ ఒక్క హామీ అమలు చేసిన పాపాన పోలేదని విమర్శించారు. ఎన్నికల్లో సూపర్ సిక్స్‌తోపాటు 143 వాగ్దానాలు చేశారని, వాటిలో ఒక్కటైనా అమలు చేశారా? అంటూ నిలదీశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బండి జకరయ్య, కదిరి ప్రసాద్‌గౌడ్, అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

8న జాతీయ సదస్సు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న శ్రామిక మహిళా కడప డివిజన్ ప్రతినిధులు

కడప కల్చరల్ : జీవిత బీమా సంస్థ శ్రామిక మహిళా జాతీయ సదస్సు మార్చి 8న లక్నోలో జరుగనుందని శ్రామిక మహిళా కడప డివిజన్ కన్వీనర్ పి.వసుప్రద తెలిపారు. మంగళవారం యూనియన్ కార్యాలయంలో ఈ మేరకు శ్రామిక మహిళా జాతీయ సదస్సు పోస్టర్లను విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ దేశ ఆర్థిక రంగంలో మారిన పరిస్థితుల్లో బీమా రంగం ఎదుర్కొంటున్న సమస్యలను జాతీయ సదస్సు చర్చిస్తుందని తెలిపారు. సంస్కరణలు అమలైన 25 సంవత్సరాల కాలంలో ప్రభుత్వాల విధానాలు, శ్రామిక మహిళల జీవితాల్లో గొప్పగా మార్పు తేలేదని అన్నారు. ఇప్పటికీ సమాన పనికి సమానమైన వేతనం, కనీస వేతనాలు అనేక రంగాల్లో అమలు కావడం లేదని అన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు చట్టసభల్లో ఆమోదం పొందినా, అది తక్షణం అమలులోకి వచ్చే అవకాశం లేదన్నారు. వీటితోపాటు బీమా రంగంలోని మహిళల ప్రత్యేక సమస్యల్ని కూడా సదస్సు చర్చిస్తుందని అన్నారు. ఎల్ఐసి లో నూతన నియామకాలు, తమ యూనియన్ కు గుర్తింపు, బీమా రంగంలోకి విదేశీ కంపెనీల ప్రవేశం వంటి అంశాలపై భవిష్యత్తు కార్యాచరణను సదస్సు నిర్ణయిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నేతలు రఘునాథరెడ్డి, అవధానంన శ్రీనివాస్, అమీనా పర్వీన్, వారిజాతమ్మ, లీలా లక్ష్మి, పద్మజాలత తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

కడప అర్బన్: కడప నగరంలోని ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్రాలగడ్డ సమీపంలో పేకాట ఆడుతున్న 9 మందిని సీఐ బి. రామకృష్ణ ఆధ్వర్యంలో ఎస్ఐ అమర్‌నాథ్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి మంగళవారం సాయంత్రం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.15,850 నగదును, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు.

పబ్లిక్ నోటీస్

నా కక్షిదారులు అయిన(1) చింతకుంట సుజాత, భర్త చింతకుంట రామమోహన్‌రెడ్డి (ఐటెంనెం.1), (2) కోల లేలీధర్ రావ్, తండ్రి కోల నాగన్న, పోట్లిరెడ్డి ఐటెం నెం.2 (3)దప్పేపల్లి అజితేశ్వరరావు,తండ్రి దప్పేపల్లి క్రిష్ణమూర్తి (ఐటెంనెం.3),(4) పోతిరెడ్డి శ్రీకల్పన, భర్త పోతిరెడ్డి రామప్రసాద్‌రెడ్డి (ఐటెంనెం.4) మరియు (5) చింతకుంట రామమోహన్‌రెడ్డి, తండ్రి క్రిష్ణారెడ్డి (ఐటెం నెం.5). అను వారి సూచనల మేరకు పై తెలిపిన నా కక్షిదారులు అందరూ కలసి తేది.26-07-2019 న డా॥మేలపాటి పావని, భర్త జగన్నాధం రమణయ్య అను ఆమె ద్వారా నా కక్షిదారులు క్రింద కనబరచిన షెడ్యూలు ఆస్తిని విక్రయించుకొన్నారు. డా॥ మేలపాటి పావనికి షెడ్యూలు కనబరచిన ఆస్తి సర్ఫేసి యాక్టు క్రింద స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కడప మెయిన్ బ్రాంచ్ మేనేజర్ ద్వారా 27-06-2019వ తేదిన రిజిష్టరు సేల్ డీడ్ ద్వారా విక్రయం పొందివున్నారు. సదరు డా॥ మేలపాటి పావని వేలంలో అత్యధిక బిడ్డర్ గా యుండి విక్రయం పొందియున్నారు. తరువాత పైన కనబరచిన నా కక్షిదారులు పైన తెలిపిన డా॥ మేలపాటి పావని గారి ద్వారా విక్రయం పొందియున్నారు. తరువాత బోగా యుగంధర్ అనుఅతను షెడ్యూలు ఆస్తిని తన ఆస్తిగా చూపించి గౌరవ కడప మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి, కడప గారి కోర్టు నందు ఓ.యస్.నెం: 871/2019 గా దావా దాఖలు చేసియున్నారు. సదరు వ్యాజ్యము 16-07-2024న రాజిశ్రీ కోర్టు వారు డిస్మిస్ చేయడం జరిగినది.తరువాత నా కక్షిదారులు వివిధ ప్రాంతలలో ఉన్నందువలన సదరు ఆస్తి నందు ఐదు కొత్త గృహములు కట్టి యుండినారు. సదరు కొత్త గృహములను ఎవ్వరైనా కొనుగోలిన వారిపైన చట్టరిత్యా సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకొనగలరు. సదరు షెడ్యూలు ఆస్తిలో గృహములు నిర్మించిన అతనికి గానీ, ఎవ్వరైన కొనిన యెడల గానీ మా కక్షిదారులు తీసుకొనబోవు చర్యలకు బాధ్యతవహించగలరు.సదరు గృహములకు ఎటువంటి హక్కు ఎవ్వరికి గానీ లేదు.

షెడ్యూలు

ఐటెం నెం.1: కడప డి॥ కడప అర్బన్ సబ్ డి॥ కడప మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో చేరిన చిన్నచౌకు గ్రామ పొలంలో 3వ వార్డు కార్పొరేషన్ వారి 38వ వార్డుకు చేరిన రామాంజనేయపురం లోపలి భాగంలోని జాగాకు నెంబరు వారి వివరం: సర్వారు పుంజి డి.నెం:422దు పైకి య.0.19 సెంట్లు జాగాను ప్లాట్లుగా విభజించగా రాబడిన ప్లాట్లుపైకి ప్లాట్ నెం.5దు య.0.0.3 1/2 సెంట్లు, ప్లాట్ నెం.6దు, య.0.03 సెంట్లు వెరశి య.0.06 1/2 సెంట్లు లేక 0.026 హెక్టార్లు గల జాగాకు హద్దులు: తూర్పు: తుంగా కొండయ్య యం. పెంచలయ్య గార్లు ఇతరులకు విక్రయించిన జాగా. పడమర: ఈ దినం నేను సి. రామమోహన్ రెడ్డి గారికి విక్రయించిన ప్లాట్ నెం.4దు గల జాగా. ఉత్తరం: రస్తా. దక్షిణం: జయశీలమ్మ గారి జాగా.

ఐటెం నెం.2: కడప డి॥ కడప అర్బన్ సబ్ డి॥ కడప మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో చేరిన చిన్నచౌకు గ్రామ పొలంలో 3వ వార్డు కార్పొరేషన్ వారి 38వ వార్డుకు చేరిన రామాంజనేయపురం లోపలి భాగంలోని జాగాకు నెంబరు వారి వివరం: సర్వారు పుంజి డి.నెం:422దు పైకి య.0.19 సెంట్లు జాగాను ప్లాట్లుగా విభజించగా రాబడిన ప్లాట్లుపైకి ప్లాట్ నెం.1దు య.0.02 1/2 సెంట్లు లేక 0.010 హెక్టార్లు గల జాగాకు హద్దులు: తూర్పు: ఆ దినం నేను డి. అజితేశ్వరరావు గారికి విక్రయించిన ప్లాట్ నెం.2దు జాగా పడమర: దిబ్బిగారి నారాయణ గారి భూమి. ఉత్తరం:రస్తా దక్షిణం: జయశీలమ్మ గారి జాగా.

ఐటెం నెం.3 : కడప డి॥ కడప అర్బన్ సబ్ డి॥ కడప మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో చేరిన చిన్నచౌకు గ్రామ పొలంలో 3వ వార్డు కార్పొరేషన్ వారి 38వ వార్డుకు చేరిన రామాంజనేయపురం లోపలి భాగంలోని జాగాకు నెంబరు వారి వివరం: సర్వారు పుంజి డి.నెం:422దు పైకి య.0.19 సెంట్లు జాగాను ప్లాట్లుగా విభజించగా రాబడిన ప్లాట్లుపైకి ప్లాట్ నెం.2దు య.0.03 సెంట్లు లేక 0.012 హెక్టార్లు గల జాగాకు హద్దులు : తూర్పు: ఈ దినం నేను పి.శ్రీ కల్పన గారికి విక్రయించిన ప్లాట్ నెం.3దు జాగా. పడమర: ఈ దినం నేను కె.లేలీధర్ రావ్ గారికి విక్రయించిన ప్లాట్ నెం.1దు జాగా. ఉత్తరం: రస్తా దక్షిణం: జయశీలమ్మ గారి జాగా.

ఐటెం నెం.4 : కడప డి॥ కడప అర్బన్ సబ్ డి॥ కడప మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో చేరిన చిన్నచౌకు గ్రామ పొలంలో 3వ వార్డు కార్పొరేషన్ వారి 38వ వార్డుకు చేరిన రామాంజనేయపురం లోపలి భాగంలోని జాగాకు నెంబరు వారి వివరం: సర్వారు పుంజి డి.నెం:422దు పైకి య.0.19 సెంట్లు జాగాను ప్లాట్లుగా విభజించగా రాబడిన ప్లాట్లుపైకి ప్లాట్ నెం.3దు య.0.03 1/2 సెంట్లు లేక 0.014 హెక్టార్లు గల జాగాకు హద్దులు : తూర్పు: ఈ దినం నేను సి.రామమోహన్‌రెడ్డి గారికి విక్రయించిన ప్లాట్ నెం.4దు జాగా. పడమర: ఈ దినం నేను డి.అజితేశ్వరరావు గారికి విక్రయించిన ప్లాట్ నెం.2దు జాగా. ఉత్తరం: రస్తా. దక్షిణం: జయశీలమ్మ గారి జాగా.

ఐటెం నెం.5 : కడప డి॥ కడప అర్బన్ సబ్ డి॥ కడప మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో చేరిన చిన్నచౌకు గ్రామ పొలంలో 3వ వార్డు కార్పొరేషన్ వారి 38వ వార్డుకు చేరిన రామాంజనేయపురం లోపలి భాగంలోని జాగాకు నెంబరు వారి వివరం: సర్వారు పుంజి డి.నెం:422దు పైకి య.0.19 సెంట్లు జాగాను ప్లాట్లుగా విభజించగా రాబడిన ప్లాట్లుపైకి ప్లాట్ నెం.4దు య.0.03 1/2 సెంట్లు లేక 0.014 హెక్టార్లు గల జాగాకు హద్దులు : తూర్పు: ఈ దినం నేను సి.సుజాత గారికి విక్రయించిన ప్లాట్ నెం.5దు జాగా. పడమర: ఈ దినం నేను పి.శ్రీ కల్పన గారికి విక్రయించిన ప్లాట్ నెం.3దు జాగా. ఉత్తరం: రస్తా. దక్షిణం: జయశీలమ్మ గారి జాగా.

ఇట్లు... శ్రీ పి.రామ ప్రసాద్ రెడ్డి న్యాయవాది, కడప.
సెల్ : 9985259609

భూ సమస్యలను పరిష్కరించండి

– జాయింట్ కలెక్టర్ అదితి సింగ్



అధికారులతో సమీక్షిస్తున్న జాయింట్ కలెక్టర్ అదితి సింగ్

సిద్దవటం : మండలంలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ సూచించారు. మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం రెవెన్యూ సదస్సులపై జాయింట్ కలెక్టర్ సమీక్షించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం నుంచి శుక్రవారం వరకు జిల్లాలోని రెండు మండలాలను తనిఖీ చేసి సిబ్బంది తీరును పర్యవేక్షిస్తున్నామన్నారు. అందులో భాగంగా సిద్దవటం తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ సదస్సులు, పీజీఆర్ఎస్, భూ రీసర్వే, గ్రీవెన్స్ పరిష్కారం, సిబ్బంది పనితీరును పర్యవేక్షించడం జరిగిందన్నారు. సిద్దవటం మండలం లోని ఉప్పరపల్లె మాధవరం–1 గ్రామ పంచాయతీలలో జరుగుతున్న భూ కబ్జాలను అరికట్టాలని కడప ఆర్డీఓ జాన్‌ఇర్విన్‌కు ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో కడప ఆర్డీఓ జాన్‌ఇర్విన్, ఇన్‌చార్జి తహసీల్దారు మాధవీలత, ఆర్ఐ ప్రసాద్, వీఆర్ఓలు, సర్వేయర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలల చట్టాలపై అవగాహన

చింతకొమ్మదిన్నె : మహిళా పోలీస్‌స్టేషన్ కడప యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఇన్‌స్పెక్టర్ ఈదురుబాషా ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో బాలలకు సంబంధించిన చట్టాలపైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పిల్లలు సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. మండల విద్యాశాఖాధికారి రమాదేవి మాట్లాడుతూ పిల్లలు సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్స్ జి.మహేష్ మాట్లాడుతూ 18 సంవత్సరాలలోపు పిల్లలకు ప్రత్యేకంగా బాలల న్యాయ చట్టం ఉందని 18 సంవత్సరాలలోపు పిల్లలందరూ ఈ చట్టం పరిధిలోకి వస్తారన్నారు. పిల్లలు తమ సమస్యలను చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 కి ఫోన్ చేసి సహాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో విశేష పూజలు

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూల మూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నెల 26న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉదయం 10 గంటలకు ఆలయంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేయనున్నారు.



రాష్ట్ర బడ్జెట్ అన్ని ప్రాంతాలను సమన్యాయం చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఈనెల 24 నుంచి 28 వరకు ప్రవేశ పెట్టనున్న రాష్ట్ర బడ్జెట్‌లో అన్ని ప్రాంతాలకు, వర్గాలకు సమన్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీకి చెందిన సత్తార్, వైఎస్ఆర్‌సీపీకి చెందిన శివ, వెనుకబడిన జిల్లాల అభివృద్ధి వేదిక సభ్యుడు బి. నారాయణ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని వైఎస్ఆర్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ×రాష్ట్ర బడ్జెట్ కేటాయింపుల్ల పై చర్చా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర శాసనసభలో వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో అన్ని ప్రాంతాలకు, వర్గాలకు న్యాయం చేయాలని కోరారు. వ్యవసాయ రంగానికి, పారిశ్రామిక రంగానికి పెద్దపీట వేయాలని తెలిపారు. రాయలసీమ వెనుకబాటు తనాన్ని దృష్టిలో పెట్టుకొని కడపలో ఉక్కు ఫ్యాక్టరీ, ప్రాజెక్టుల నిర్మాణాలకు కృషి చేయాలని కోరారు. అభివృద్ధిని వికేంద్రీకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అనుబంధ సంఘాల నాయకులు, వామపక్ష చేతి వృత్తుల ఐక్యవేదిక నాయకుడు అవ్వారు మల్లికార్జున, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నేత రవిశంకర్ రెడ్డి, ప్రసాదు, ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకుడు సీఆర్‌వీ ప్రసాద్, అంజి, తదితరులు పాల్గొన్నారు.